క్లుప్తంగా

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మడకశిర: నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు గురువారం ఎంఈఓ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడానికి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్, జిల్లా కమిటీ సభ్యులు శశికుమార్, హరి, నవీన్ ఉన్నారు.

పంచాయతీకి రూ.13.7 లక్షల ఆదాయం

చిలమత్తూరు: మండలంలోని చిలమత్తూరు మేజర్ పంచాయతీలో గురువారం వారపుసంతకు వేలంపాట నిర్వహించారు. వారపుసంతను రూ.2.37 లక్షలకు, షాపింగ్ కాంప్లెక్స్‌ను రూ.10.70 లక్షలకు పలువురు దక్కించుకున్నారు. పంచాయతీకి మొత్తంగా 13.7 లక్షలు ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి రామ్లానాయక్ పేర్కొన్నారు. బస్టాండ్, జంతువధశాల వేలంపాట వాయిదా పడినట్లు తెలిపారు.

ముతుకూరులో వైద్య శిబిరం


హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ భారతి, ఎంపీడీఓ బంగారమ్మ

గుడిబండ: మండలంలోని ముతుకూరు గ్రామంలో డయేరియా కేసులపై గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ముతుకూరు గ్రామంలో డయేరియా ప్రబలి తొమ్మిది మంది అస్వస్థకు గురయ్యారు. వైద్యాధికారులు హటాహుటిన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు మెరుగైన చికిత్స అందించారు. ఎంపీడీఓ బంగారమ్మ గ్రామంలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ తాగునీరు కలుషితం వల్లే వ్యాధి ప్రబలిందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. వ్యాధి తగ్గే వరకూ గ్రామంలో మంచి నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న పాస్టర్లు

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారి అశ్వత్థరామప్ప అన్నారు. మండలంలోని ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమ ఆవరణంలో గురువారం ఆయన వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ అభివృద్ధికి నిర్వాహకులకు రూ.10 వేల విరాళం అందజేశారు.

పుస్తకావిష్కరణ

అమరాపురం: మండలంలోని కె.శివరం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు ముద్దరంగప్ప రచించిన హిమ బిందువులు అనే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా, సమాజ సేవాకర్త ఫరూక్ మాట్లాడుతూ తెలుగు వైభవాన్ని కవిత్వ, పద్య రూపంలో రాస్తున్న ఉపాధ్యాయుడి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.శ్రీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం


స్నేహితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన మిత్రుడికి పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఆర్థికసాయం చేశారు. వివరాలు.. హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993 బ్యాచ్ విద్యార్థులు తమ సహ విద్యార్థి సనావుల్లా అనారోగ్యంతో మంచాన పడినట్లు తెలుసుకున్నారు. మిత్రులంతా కలిసి పోగుచేసిన రూ.40 వేల ఆర్థికసాయాన్ని గురువారం సనావుల్లా కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో 93 బ్యాచ్ సంఘం గౌరవాధ్యక్షుడు రంగన్న, అశ్వర్థనారాయణ, అధ్యక్షుడు తిప్పేస్వామి మిత్ర బృందం సరళ, కేశమాంబ, చంద్ర, బాలకృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో నిఘా నేత్రాలు!


వైఎస్సార్ సర్కిల్ వద్ద పనిచేయని సీసీ కెమెరా


వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న నిఘానేత్రం

- బస్టాండ్, ప్రధాన కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు

రొద్దం: మండల కేంద్రంలోని బస్టాండ్, ప్రధాన కూడళ్లు, దేవాలయాల వద్ద చోరీలు జరగకుండా చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు(సీసీ కెమెరాలు) నిర్లక్ష్యం నీడలో కొట్టు మిట్టాడుతున్నాయి. నెలల తరబడి సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రయాణికులను చోరీల బెడద వెంటాడుతోంది. వివరాల్లో వెళితే.. చుట్టుపక్కల 63 గ్రామాలకు కేంద్రంగా ఉన్న మండల కేంద్రంలో నిత్యం ప్రజలతో కిటకిటలాడుతుంటుంది. రద్దీని ఆసరాగా చేసుకుని కొందరు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు సులువుగా ఛేదించడంతోపాటు వాటిని నివారించేందుకు గతంలో పోలీసులు అధికారులు దాదాపు రూ.30 వేలు వెచ్చించి మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్, బస్టాండ్ ఆవరణ, వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద రెండు కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే సీసీ కెమెరాలు కొన్ని నెలల నుంచి పని చేయడం లేదు. దీంతో ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయం


కళాశాలను సందర్శించిన భారత మాజీ రాయబారి

పెనుకొండ: ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని భారత మాజీ రాయబారి రోమెల్ ప్రశంసించారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలకు చెందినఎన్ఎస్ఎస్ వలంటీర్లు పుట్టపర్తిలో తరచూ జరిగే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలను పెరుగుతాయన్నారు. త్వరలో పుట్టపర్తిలో జరిగే పర్తియాత్రకు విద్యార్థులు, అధ్యాపకులు హాజరుకావాలని ఆయన కోరారు. అధ్యాపకుల పనితీరును రోమెల్ కొనియాడారు. ప్రిన్సిపాల్ కేశవరావు, సత్యసాయి విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు దినేష్, కరుణాకర్, సత్యసాయి సమితి పెనుకొండ కన్వీనర్ శంకరప్ప, ఎన్ఎస్ఎస్ అధికారి రంగనాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాలతో ఇబ్బందులు


రొద్దంలోని బూచెర్ల రోడ్డులో ప్రమాదకరంగా వస్తున్న వాహనం

రొద్దం: మండల కేంద్రంలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదారి, బూచెర్ల–రొద్దం ప్రధాన రహదారిపై అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు, వివిధ చిల్లర దుకాణాల ఏర్పాటు చేసుకోడంతో వాహనాలు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ఎక్కడకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. పలుమార్లు పోలీసులకు చెప్పినా ప్రయోజనం ఉండటం లేదని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న వివిధ దుకాణాలు తొలగించి వాహనాల రాకపోకలు సజావుగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

నేడు సర్పంచులు, కార్యదర్శులతో సమీక్ష

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సర్పంచులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఓఆర్డీ క్రిష్టప్ప గురువారం తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తానన్నారు. అన్ని పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని తెలిపారు.

పంటల సాగుపై అవగాహన

గుడిబండ: మండల కేంద్రంలో రైతులకు మేలైన పంట సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏడీఏ సనాఉల్లా మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీ వాడకం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా సస్య రక్షణ మందులను పిచికారీ చేయడం వల్ల సమయం వృథా కాదన్నారు. వేరుశనగ, రాగి, మొక్కజొన్న, కంది, పత్తి పంటల్లో పాటించవలసిన మేలైన సాగు పద్ధతుల గురించి వివరించారు. వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఆముదం, కంది వంటి పంటలను పండించాలని రైతులకు సూచించారు. రైతులు తప్పనిసరిగా ఈ– క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం: రైతులు మేలైన సాగు పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించ వచ్చని ఏడీఏ సనావుల్లా అన్నారు. గురువారం మండలంలోని హాలుకూరు ఆర్బీకేలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు ఒకే పంటను సాగు చేయకుండా మేలైన పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులను సాధించాలన్నారు. ముఖ్యంగా నానో యూరియా, డీఏపీ, వాడకం వల్ల కలిగే లాభాలను వివరించారు. డ్రోన్ పద్ధతుల ద్వారా సస్య రక్షణ చేయించాలన్నారు. మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, రాగి తదితర పంటల సాగు దానిలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రతి ఒక్కరూ కేవలం వేరుశనగ పంట కాకుండా అంతర పంటలైన అలసంద, ఉలవలు, పెసర, ఆముదం తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మంజునాథ, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

హనుమంతరాయప్ప కుటుంబానికి అండ

మడకశిర: వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంతరాయప్ప కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు మడకశిర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప తెలిపారు. ఆయన గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. గుడిబండ మండలం మందలపల్లికి చెందిన హనుమంతరాయప్ప ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో మృతుడి కుటుంబ పరిస్థితిని రాత మూలకంగా వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఈరలక్కప్ప ఫోన్‌లో సాక్షికి తెలిపారు. తప్పకుండా మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జగన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. టీడీపీ నాయకుల దాడుల్లో నష్టపోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను నేరుగా కలవడానికి రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో పర్యటిస్తానని వైఎస్ జగన్ తెలిపారన్నారు. ఈ పర్యటనలో హనుమంతరాయప్ప కుటుంబాన్ని కూడా పరామర్శిస్తానని ఆయన చెప్పారన్నారు. అంతే కాకుండా ఈ సమావేశంలో తమకు పార్టీ అభివృద్ధిపై దిశా నిర్దేశం చేశారన్నారు. పార్టీ ఓడిపోయిందని ఆందోళన చెందవద్దని, 40 శాతం ఓట్లు తమ పార్టీకి వచ్చాయని, భవిష్యత్ తమదేనని వైఎస్ జగన్ ధైర్యం చెప్పారన్నారు. వైఎస్ జగన్ సూచన మేరకు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతానని ఈరలక్కప్ప తెలిపారు.

రోడ్డు మరమ్మతు


మరమ్మతు చేస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

మడకశిర: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతులు చేట్టారు. సర్కిల్‌లో గుంతలు పడడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో స్థానికులు వినతి మేరకు ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై గుంతలను పూడ్చారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఈ లక్ష్మీనారాయణ పనులను పూర్తి చేశారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు


ఎస్‌ఐ గోపికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి


ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్‌ఐ రాజేష్

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలు అందించడంతో ఎస్‌ఐ రాజేష్‌కు ఎస్పీ మాధవరెడ్డి ప్రశాంసపత్రం అందించారు. గురువారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ ఎస్‌ఐ రాజేష్ సేవలను గుర్తించి ప్రశంసాపత్రం అందించి, అభినందించారు.

లేపాక్షి ఎస్‌ఐకి అవార్డు

లేపాక్షి: పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామమంలో గురువారం ఎన్నికల విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసులకు డిపార్టమెంట్ల వారీగా శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన లేపాక్షి ఎస్‌ఐ గోపికి ఎస్పీ మాధవరెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు.

రేపటి నుంచి ఉపాధి పనుల తనిఖీ

లేపాక్షి: మండల వ్యాప్తంగా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మే 31వ తేదీ వరకూ జరిగిన ఉపాధి హామీ పనులను శనివారం నుంచి సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ సామాజిక తనిఖీలో భాగంగా ఉపాధి పనులను తనిఖీ చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా హార్టికల్చర్, రింగ్ స్రైంచ్, ఫారంపాండ్లు, ఫీడర్‌ఛానల్స్, డగౌట్ పాండ్లు, బౌండరీ స్రైంచ్‌లు, సప్లయి ఛానల్, బరియల్ గౌండ్సు స్రైంచ్ తదితర పనులు జరిగాయన్నారు.

ఏసు మార్గంలో నడవాలి

పెనుకొండ: ప్రతి ఒక్కరూ ఏసు మార్గంలో నడవాలని పాస్టర్లు జాన్సన్, దైవాదీనం, ప్రభాకరరాజు కోరారు. పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో మోక్ష మార్గోపదేశ సభలు రెండవ రోజు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం యేసు రెండవ రాకడ జరగనున్నదన్నారు. క్రైస్తవులు ప్రేమానురాగాలతో మెలగాలన్నారు. ప్రజలందరూ యేసు ఆశీస్సులతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి


అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపి, విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని కోరారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్ష కేంద్రంలో ఒకే సీరియల్ నంబర్లతో కూడిన విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడిన అంశమన్నారు. తిరిగి పరీక్ష నిర్వహించే విధంగా కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, జస్వంత్, పవన్, లిఖిత్, అభి, హుస్సేన్, మహేష్, విక్రమ్, సురేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


బిందూనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం సూచించారు. బిందూనగర్‌లో గురువారం నేను బడికి వెళతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పిల్లలు విద్యావంతులుగా ఎదిగినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. పిల్లలకు చదువే ఆధారమన్న విషయాలను తల్లిదండ్రులు గుర్తెరిగినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సంపత్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలి


మాట్లాడుతున్న రాజకీయ ఐక్యవేదిక నాయకులు

హిందూపురం: న్యాయవాది సంపత్ కుమార్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని రాజకీయ ఐక్యవేదిక నాయకులు కోరారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆర్ఏస్‌పీ శ్రీనివాసులు అధ్యక్షతన రాజకీయ ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ముందుగా ఇటీవలే హత్యకు గురయిన న్యాయవాది సంపత్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ.. న్యాయవాది సంపత్‌కుమార్ దారుణ హత్యకు గురికావడం శోచనీయమన్నారు. సంపత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సంపత్ కుమార్‌ను చంపించిన ప్రధాన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందిస్తున్నట్లు రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో రాజకీయ ఐక్యవేదిక నాయకులు శ్యామ్ కిరణ్, వినోద్ కుమార్, శ్రీరాములు, రవికుమార్, నారాయణ, శంకర్, మున్నా, నాగన్న, కమల్ భాష, గోపాల్, హనుమంతు, నాగరాజు, తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో బుధవారం సాయంత్రం ఓ మహిళ నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లికి చెందిన అరుణను 18 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సోమశేఖర్‌కు వచ్చి వివాహం చేశారు. వీరు జీవనోపాధి నిమిత్తం హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డికి వచ్చారు. మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మగ్గాలు సరిగా జరగక పోవడం, ఆర్థిక ఇబ్బందులతో బుధవారం సాయంత్రం అరుణ గ్యాస్ స్టవ్ ఆన్ చేసి నిప్పు అంటించుకుంది. గమనించిన భర్త సోమశేఖర్ వెంటనే మంటలను ఆర్పేశాడు. చుట్టుపక్కల వారి సహకారంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స గురువారం వేకువజామున బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అరుణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. వన్‌టౌన్ ఏఎస్‌ఐ వెంకటరాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం


రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గోరంట్లలో సంబరాలు చేసుకుంటున్న ఉద్యోగులు


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

గోరంట్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో రెవెన్యూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రెవెన్యూ శాఖ విశిష్టతను సిబ్బందికి వివరించారు. అనంతరం రెవెన్యూ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్ఐ సోముశేఖరరెడ్డి, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి: స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రాజేశ్వరీ మండలంలోని రైతులకు రెవెన్యూ రికార్డుల పట్ల అవగాహన కల్పించారు. ప్రధానంగా వన్‌బీ, అడంగల్, డైగ్లాట్, పట్టాదారు పాసుపుస్తకం తదితర అంశాలను వివరించారు. రైతులు భూ సమస్యలను రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. వ్యవసాయ పొలాలకు సంబంధించి రుణాలు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఆర్ఐలు సిద్దేశ్వర్, శోభ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేవలు సక్రమంగా అందించాలి

మడకశిర: ప్రజలకు రెవెన్యూ సేవలను సక్రమంగా అందించాలని స్థానిక తహసీల్దార్ వెంకటేశ్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తోపాటు మడకశిర అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ గౌరీశంకర్‌రావు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు చాలా అవసరమన్నారు. ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ చాలా కీలకమైందన్నారు. రెవెన్యూ సిబ్బంది రైతుల సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. రిటర్నింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖలో పని చేసే అన్ని స్థాయి అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దార్లు శివశంకర్, రంగప్ప తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

బీసీజీ టీకాతో క్షయను తరిమికొడదాం


సచివాలయంలో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గుడిబండ: మండల వ్యాప్తంగా గురువారం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు బీసీజీ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మెడికల్ ఆఫీసర్ సౌందర్య, పీహెచ్ఎన్ సుధారాణి మాట్లాడుతూ వృద్ధాప్యంలో టీకాలు వేయడం వల్ల ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా క్షయ వ్యాధికి మందులు వాడిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ టీకా వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్టులు రావన్నారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 1,822 మందికి వ్యాక్సిన్ వేశామనాన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రైల్వే గేటు మూసివేత

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వేగేటును శుక్రవారం మూసివేస్తున్నట్లు తహసీల్దార్ అంజనాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటు వద్ద ట్రాక్ మరమ్మతుల కారణంగా గేటు బంద్ చేస్తున్నారని, హిందూపురం, పెనుకొండ వైపు రాకపోకలు జరిపే వారు ఇతర మార్గాల నుంచి వెళ్లాలని సూచించారు. రైల్వే శాఖ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత రాకపోకలు కొనసాగడానికి అవకాశం కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు.

సంతలో పశువుల పోట్లాట

సోమందేపల్లి: మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతలో పశువులు పోట్లాడాయి. దీంతో బెదిరిన కొన్ని ఆవులు రోడ్డుపై వెళుతున్న వాహనదారులు, దుకాణదారులపై దూసుకెళ్లాయి. ఈ ఘటనలో పలువురు జారి పడి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒక్క సారిగా దాదాపు 20 దాక ఆవులు హల్‌చల్ చేయడంతో సంతకు వచ్చిన మహిళలు, వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారు. నిత్యం రోడ్లపైనే పశువులు తిష్ట వేసి ఉంటుండటంతో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వాటిని కట్టడి చేయాలని కోరుతున్నారు.